సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



పడావు పడినా పర్వాలేదా?!

ప్రైవేట్ కార్యక్రమాలకు అద్దెకు ఇచ్చేందుకు ఐదేళ్ల క్రితం ఇల్లెందులో నిర్మించిన గిరిజన భవన్ నిరుపయోగంగా ఉంటోంది. 8లో



ముగిసిన వారోత్సవాలు

అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్న వారోత్సవాలు శనివారం ముగిశాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
41° / 25°

జిల్లాలో ఆదివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గంటగంటకూ ఎండ పెరుగుతుంది. రాత్రి వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాల్లో తెప్పోత్సవం

గోదావరిలో శ్రీ సీతారాముల జలవిహారం



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో వసంత ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం తెప్పోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, వేదమంత్రాల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులను అశ్వ వాహనంపై ఊరేగింపుగా గోదావరి నది వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన పడవలో స్వామివారిని వేంచేపు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ రమాదేవి గోదావరి మాతకు పసుపు, కుంకుమ సమర్పించారు. ఆ తర్వాత స్వామివారికి జలవిహారం గావించారు. ఇక రాత్రికి దొంగల దోపు ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది వివిధ వేషధారణలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఊంజల్ సేవ, సింహవాహన సేవ జరపనున్నారు.

బాసరలో ఎస్పీ పూజలు



కుమారుడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎస్పీ

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలో సరస్వతీ అమ్మవారిని భద్రాద్రి ఎస్పీ బి.రోహిత్‌రాజ్ శనివారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కుమారుడికి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారి ఆశీస్సులు తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని విశాఖపట్నం జిల్లాకు చెందిన బొంగరాల రామ్‌కుమార్ శనివారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ అధికారులకు చెక్కు అందజేయగా, వారు రశీదు ఇచ్చారు. అనంతరం దాతలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 26వరకు ప్యాసింజర్ రైళ్ల రద్దు

- కృష్ణా ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

ఖమ్మం స్పోర్ట్స్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మూడో లైన్ నిర్మాణ పనుల నేపథ్యాన ఈనెల 22నుంచి మే 26వ తేదీ వరకు ఖమ్మం మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ.జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలంరోడ్డు – విజయవాడ(07278), విజయవాడ – భద్రాచలం రోడ్డు(07979) ప్యాసింజర్లతో పాటు కాజీపేట – డోర్నకల్ జంక్షన్(07753), డోర్నకల్ జంక్షన్ – కాజీపేట(07554) ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా డోర్నకల్ – విజయవాడ(07755), విజయవాడ – డోర్నకల్(07756) ప్యాసింజర్ రైళ్ల రద్దు కూడా మే 26వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. ఇక తిరుపతి – ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్(17405) రైలు ఈనెల 29నుంచి మే 10వ తేదీ వరకు, మే 16నుంచి 22వ తేదీ వరకు గూడూరు, తెనాలి, గుంటూరు మీదుగా సికింద్రాబాద్‌కు చేరుకుని యథావిధిగా ఆదిలాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే, ఆదిలాబాద్ – తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్(17406) రైలును ఈనెల 28నుంచి మే 9వ తేదీ వరకు, మళ్లీ మే 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు దారి మళ్లించనున్నట్లు తెలిపారు.


ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ పరిస్థితి మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ఓ వైపు లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహిస్తుండగా.. మరోవైపు ఎప్పుడు ఎవరు పార్టీని వీడుతారో తెలియని అనిశ్చితి నెలకొంది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరారు. తాజాగా వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ రాజీనామా చేశారు. ఇక పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. అలాగే, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు ఇప్పటికే పలువురు 'హస్తం' గూటికి చేరగా.. శనివారం 16వ డివిజన్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షాన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. లోక్‌సభ పోలింగ్ సమీపించే కొద్దీ మరికొందరు బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పార్టీని వీడుతారనే ప్రచారం జరుగుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ముందుకు.. వెనక్కి!

ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్‌లో నిస్తేజం

- వరుసగా పార్టీని వీడుతున్న నేతలు
- పార్లమెంట్ ఎన్నికల వేళ 'కారు'లో కంగారు
- కాంగ్రెస్‌లో చేరనున్న మాజీ ఎమ్మెల్యే రాములునాయక్
- అదేబాటలో మరికొందరు ప్రజాప్రతినిధులు



గతమెంతో ఘనం..

తెలంగాణ ఏర్పడిన తొలి దఫా ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీకి అభ్యర్థులను వెతుక్కోవాల్సి వచ్చింది. 2014 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి జలగం వెంకట్రావు మాత్రమే విజయం సాధించారు. ఆ తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో బీఆర్‌ఎస్‌లోకి వలసలు మొదలయ్యాయి. కాంగ్రెస్, ఇతర పార్టీల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ తర్వాత ఎన్నికల్లోనూ ఖమ్మం నుంచి పువ్వాడ అజయ్‌కుమార్ మాత్రమే గెలుపొందినా ఎమ్మెల్యేల వలసలు కొనసాగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరడమే తప్ప, పార్టీని వీడిన వారు అతి తక్కువ మంది ఉన్నారు. 2018 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన లావుడ్యా రాములునాయక్, కాంగ్రెస్ నుంచి గెలుపొందిన కందాళ ఉపేందర్‌రెడ్డి, హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, టీడీపీ నుంచి గెలుపొందిన సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇలా అన్ని పార్టీల నుంచి వచ్చిన నేతలతో బీఆర్‌ఎస్ కళకళలాడుతూ కనిపించింది.

'అసెంబ్లీ' ఓటమితో..

తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో బీఆర్‌ఎస్‌కు సంకట పరిస్థితి ఎదురవుతోంది. గతంలో పార్టీలోకి వలసలు ఎలా కొనసాగాయో.. ఇప్పుడు నిష్క్రమణలు కూడా అలాగే జరుగుతున్నాయి. వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ తాజాగా బీఆర్‌ఎస్‌ను వీడగా, ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఏన్కూరు మండల అధ్యక్షుడు బానోతు సురేష్‌నాయక్ సైతం రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ ఆదివారం వైరాలో ముఖ్య అనుచరులతో సమావేశమై ఏ పార్టీలో చేరతారనే నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు తెలిసింది. అలాగే ఖమ్మం కార్పొరేషన్‌లో పలువురు కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇంకొందరు సైతం వారం రోజుల్లో పార్టీని వీడనున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ ఈ రాజీనామాలు పార్టీకి తలనొప్పి తెచ్చి పెడుతున్నాయి. పార్టీని వీడతారనే అనుమానం ఉన్న నేతలను బుజ్జగించేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి నేతలు ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు.

సమన్వయం లొల్లి..

ఖమ్మం లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రచారానికి సమన్వయకర్తల పేర్లతో కేటీఆర్ పేరిట ఇటీవల ప్రకటన వెలువడింది. ఈ నియామకాలు పార్టీలో నేతల మధ్య చిచ్చుపెట్టాయి. నియామకాల్లో సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకోలేదని ముఖ్య నేతల తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గ నేతలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇష్టానుసారంగా నియమించారని బహిరంగంగానే విమర్శించారు. దీంతో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ స్పందించారు. త్వరలోనే జిల్లా పార్టీ ముఖ్యులతో చర్చించి, సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకొని నియోజకవర్గ సమన్వయ కమిటీలను ప్రకటిస్తామని వెల్లడించాల్సి వచ్చింది.

ముందు నుంచే అసంతృప్తి..

వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కేటాయించలేదు. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఉమ్మడి జిల్లాలో సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఇచ్చి తనకు ఇవ్వకపోవడం ఏంటని ఒక దశలో ప్రశ్నించగా.. కేసీఆర్ తదితరులు బుజ్జగించడంతో మెత్తపడ్డారు. వైరాలో పార్టీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కేసీఆర్‌తోపాటు పలు సభల్లో ప్రచారంలో పాల్గొనగా.. కేసీఆర్ ఆయనను అభినందించారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో తన కుమారుడికి టికెట్ ఇప్పించుకోవాలని ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. తనకు అసెంబ్లీ టికెట్ కేటాయించకపోవడం, లోక్‌సభ ఎన్నికల్లోనూ కుమారుడికి మొండిచేయి చూపడంతో నిరుత్సాహానికి గురై పార్టీని వీడినట్లు తెలిసింది.

29న ఖమ్మంకు కేసీఆర్

రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో బస్సుయాత్ర



సాక్షిప్రతినిధి, ఖమ్మం: గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29న ఖమ్మం నగరానికి రానున్నారు. రెండు రోజుల పాటు ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలో పర్యటిస్తారు. బస్సుయాత్రలో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఆయన పర్యటన షెడ్యూల్ శనివారం విడుదలైంది. ఈ షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీన వరంగల్‌లో రోడ్డు షో ముగించుకుని 29న కేసీఆర్ ఖమ్మం చేరుకుంటారు. ఆ రోజు ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తరఫున ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలో జరిగే రోడ్డుషోలో పాల్గొని ఇక్కడే బస చేస్తారు. ఇక 30న సాయంత్రం తల్లాడ రోడ్డు షోలో పాల్గొని కొత్తగూడెం వెళ్లి అక్కడ రోడ్డు షోలో ప్రసంగిస్తారు. ఆ రోజు రాత్రి కొత్తగూడెంలో బస చేయనున్న కేసీఆర్.. మరుసటి రోజు టేకులపల్లి, ఇల్లెందు మీదుగా మహబూబాబాద్ వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోతు కవిత తరఫున ప్రచార సభల్లో మాట్లాడతారు. సిట్టింగ్ స్థానాలైన ఖమ్మం, మహబూబాబాద్ సీట్లను దక్కించుకోవడంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ ముఖ్య నేతలు ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

అభ్యర్థుల ఖర్చు విధిగా నమోదు చేయాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు శంకర్‌నంద మిశ్రా



మిశ్రాకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులను విధిగా నమోదు చేయాలని వ్యయ పరిశీలకులు శంకర్‌నంద మిశ్రా అన్నారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయనకు కలెక్టర్ ప్రియాంక ఆల స్వాగతం పలికారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మిశ్రా మాట్లాడుతూ.. అభ్యర్థుల నామినేషన్ నాటి నుంచి పోలింగ్ జరిగే వరకు ప్రతీ రూపాయి ఖర్చును నమోదు చేయాలని పరిశీలన బృందాలకు సూచించారు. అన్ని బృందాలు సమన్వయంతో పని చేయాలన్నారు. డబ్బు, మద్యం ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లను చైతన్యపర్చాలని చెప్పారు. బ్యాంకు ఖాతాలు, డిజిటల్ లావాదేవీలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ర్యాలీలు, సమావేశాలు జరిగినప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయించిన ధర ప్రకారం ఖర్చు నమోదు చేయాలని వివరించారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

పకడ్బందీగా ఎన్నికల వ్యయ పరిశీలన

మహబూబాబాద్ పార్లమెంట్ పరిశీలకులు రాంకుమార్‌గోపాల్



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌గోపాల్

ఇల్లెందు: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు చేసే ప్రతీ ఖర్చును నిశితంగా పరిశీలిస్తూ నమోదు చేయాలని, ఇందుకోసం బృందాలు విధులు నిక్కచ్చిగా నిర్వర్తించాలని మహబూబాబాద్ లోక్‌సభ స్థానం ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్ గోపాల్ సూచించారు. ఇల్లెందులోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో సమావేశమయ్యారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఉద్యోగులు కేటాయించిన స్థానాల్లో విధులు నిర్వర్తించాలని సూచించారు. కేంద్రం ఎన్నికల సంఘం ప్రకటించిన మేరకు అభ్యర్థుల ఖర్చులను నమోదు చేయాలని.. ఈక్రమంలో ర్యాలీలు, సభలను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంసీసీ, వీవీటీ, ఫ్లైయింగ్ స్కాడ్, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, అకౌంట్ విభాగం అధికారులు పాల్గొనగా సలహాలు, సూచనలు చేశారు. ఇల్లెందు నియోజకవర్గ నోడల్ అధికారి సయ్యద్ ఖుర్షీద్, లైజనింగ్ అధికారి తిరుపతయ్య, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు జె.కాశయ్య, సీహెచ్.కోటయ్య, సహాయ ఎన్నికల అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలను తరలిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాంను శనివారం ఆమె అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని ఐదు సెగ్మెంట్లలోని స్ట్రాంగ్ రూంలకు మొదటి ర్యాండమైజేషన్‌లో కేటాయించిన ఈవీఎంలను తరలిస్తున్నట్లు చెప్పారు. కొత్తగూడెం నియోజకవర్గానికి 316 బ్యాలెట్ యూనిట్లు, 316 కంట్రోల్ యూనిట్లు, 354 వీవీ ప్యాట్‌లను శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చనున్నట్లు తెలిపారు. భద్రాచలం నియోజకవర్గానికి కేటాయించిన 225 బ్యాలెట్ యూనిట్లు, 225 కంట్రోల్ యూనిట్లు, 252 వీవీ ప్యాట్‌లు భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, అశ్వారావుపేటకు సంబంధించి 230 బ్యాలెట్ యూనిట్లు, 230 కంట్రోల్ యూనిట్లు, 257 వీవీ ప్యాట్లను వ్యవసాయ కళాశాలలో, ఇల్లెందుకు కేటాయించిన 302 బ్యాలెట్ యూనిట్లు, 302 కంట్రోల్ యూనిట్లు, 338 వీవీ ప్యాట్‌లు ఇల్లందు సింగరేణి బాలికల పాఠశాలలో, పినపాక సెగ్మెంట్‌కు కేటాయించిన 312 బ్యాలెట్ యూనిట్లు, 312 కంట్రోల్ యూనిట్లు, 350 వీవీ ప్యాట్‌లు మణుగూరు జెడ్పీ స్కూల్‌లో భద్రపరుస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, సీపీఐ నాయకులు కంచర్ల జమలయ్య, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ అగర్వాల్ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై షోకాజ్ నోటీసులు



డైరీ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ తదితరులు (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుల నేపథ్యంలో డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్‌కు కొత్తగూడెం ఏఆర్వో మధు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ జేవీఎల్ శిరీష డీసీహెచ్ఎస్ రవిబాబుతో కలిసి ఈనెల 15న తన చాంబర్ వద్ద ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి ఫొటోతో ఉన్న పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (3194) డైరీని ఆవిష్కరించారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుగులోత్ రాజేష్‌నాయక్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆలతో పాటు కొత్తగూడెం ఏఆర్వో మధుకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఖమ్మం ఎన్నికల అధికారికి, బీఎస్పీ వారు రాష్ట్ర ఎన్నికల అధికారికి కూడా ఫిర్యాదు చేశారు. దీంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై ఏఆర్ఓ మధును 'సాక్షి' వివరణ కోరగా షోకాజ్ నోటీసులు ఇచ్చింది వాస్తవమేనని, మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించామని తెలిపారు.

'ఉపాధి' పనుల పరిశీలన



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న విద్యాచందన

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి గ్రామపంచాయతీ పరిధిలో గల జమ్మినీకుంట చెరువులో చేపట్టిన ఉపాధి హామీ పనులను డీఆర్డీఓ విద్యాచందన శనివారం పరిశీలించారు. ఉపాధి కూలీల మస్టర్, పని చేసే ప్రాంతంలోని సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని తనిఖీ చేశారు. ఈజీఎస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడుతూ.. తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స బాక్స్‌లు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు మార్కింగ్ ఇచ్చిన ప్రకారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటలకు వరకు పని చేయాలని సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా అందరూ ఓటు వేయాలంటూ ఎన్నికలపై అవగాహన కల్పించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, పంచాయతీ సెక్రటరీ హారిక, టీఏ జోధాబాయి, ఎఫ్ఏ వీరభద్రం పాల్గొన్నారు.

మొదటి అదనపు జిల్లా జడ్జి బదిలీ



బదిలీ అయిన శ్యాంశ్రీ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా జడ్జిగా విధులుగా నిర్వహిస్తున్న ఎం.శ్యాంశ్రీని సూర్యాపేటకు బదిలీ చేస్తూ హైకోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 46 మంది జడ్జీలను బదిలీ చేయగా అందులో శ్యాంశ్రీ కూడా ఉన్నారు. ఆమె గత రెండేళ్లుగా కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఆమె బదిలీతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా ఇన్‌చార్జ్ జడ్జిగా వ్యవహరిస్తారు.

'ఏకలవ్య'.. ఎన్నాళ్లిలా..?

- మూడేళ్లుగా ఆగుతూ... సాగుతున్న పనులు
- మూకమామిడిలో నిర్మాణానికి రూ.35 కోట్ల నిధులు
- ప్రస్తుతం దమ్మపేటలో కొనసాగుతున్న పాఠశాల
- ఎప్పుడు పూర్తవుతుందో తెలియక తల్లిదండ్రుల ఆవేదన



మూకమామిడి శివారులో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనాలు

ములకలపల్లి: మూకమామిడి శివారులో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. దీని నిర్మాణం ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా, నేటికీ పూర్తికాకపోవడంతో విద్యాభిలాషులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ములకలపల్లి మండలానికి ఈ పాఠశాల మంజూరు కాగా సరైన భవనాలు లేకపోవడంతో తాత్కాలికంగా దమ్మపేట మండలంలోని అంకంపాలెం గ్రామంలో నిర్వహిస్తున్నారు. భవనాల నిర్మాణం పూర్తికాగానే ఇక్కడకు తరలిస్తారు. మూకమామిడి ప్రాజెక్ట్ సమీపంలోని 13 ఎకరాల విస్తీర్ణంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)ను నిర్మిస్తున్నారు. మినిస్ట్రీస్ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ (ఎంఓటీఏ)లో రెండు దఫాలుగా రూ. 35 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో 2021లో పనులు ప్రారంభించారు. ఈ నిధులతో పాఠశాల భవనం, బాలబాలికలకు వేర్వేరుగా రెండేసి హాస్టల్ బ్లాక్‌లు, కిచెన్, డైనింగ్, ప్రహరీ, స్టాఫ్ క్వార్టర్లు, అంతర్గత రోడ్లు నిర్మించాల్సి ఉంది.

విద్యావిధానం ఇలా..

ఏకలవ్య పాఠశాలలో కో–ఎడ్యుకేషన్ విధానంలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తారు. ఈ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తారు. ఇక్కడ ప్రస్తుతం పదో తరగతి వరకు మాత్రమే ఉండగా, 275 మంది విద్యార్థులు చదువుతున్నారు. మరో రెండేళ్లలో 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ అవుతుంది. అప్పటికి 480 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరం మార్చి 31వ తేదీతో విద్యాసంవత్సరం ముగుస్తుంది. వెంటనే ఏప్రిల్ 1న అప్‌గ్రేడ్ చేసి నూతన విద్యాసంవత్సరాన్ని ప్రారంభిస్తారు. ఆ నెలంతా తరగతులు నిర్వహించి మే 1 నుంచి జూన్ 30 వరకు వేసవి సెలవులు ప్రకటిస్తారు. తిరిగి జూలై 1 నుంచి తరగతులు కొనసాగుతాయి.

ఈ ఏడాదైనా అందుబాటులోకి వచ్చేనా..

రానున్న జూలై నాటికైనా ఈ భవనాలు అందుబాటులోకి వచ్చేనా అనే అనుమానాలు నెలకొన్నాయి.

రీ టెండర్ నిర్వహించినా..

2021లో పనులు ఆరంభించగా కొంతకాలం సవ్యంగానే నిర్మాణాలు సాగాయి. అయితే కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిపివేయడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో సంబంధిత అధికారులు టెండర్ రద్దు చేశారు. రీ టెండర్ నిర్వహించి మళ్లీ పనులు ప్రారంభించడానికి కొంత సమయం పట్టింది. ఈ క్రమంలో ఏడాది పాటు పనులన్నీ నిలిచిపోయాయి. 2022 ఆగస్టులో రీ టెండర్ వేసి మిగిలిన పనులను ఆరంభించారు. దీంతో కాస్త పురోగతి మొదలైంది. భవన సముదాయాల నిర్మాణ పనులు ఒకింత ముందుకు కదిలాయి.

ప్రస్తుతం భవన నిర్మాణాల పనులు చివరి దశకు చేరుకున్నాయి. స్లాబ్‌లు పూర్తి అయి, గోడలు నిర్మించారు. ప్లాస్టింగ్ పనులు చేస్తున్నారు. ఇప్పటినుంచి నిరంతరాయంగా పనులు చేపడితే, కొన్ని బ్లాక్‌లైనా పూర్తయ్యే అవకాశాలున్నాయి. పనుల పురోగతిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూర్తయితే సౌలభ్యం



ములకలపల్లి మండలంలో సరైన భవనాలు లేక అంకంపాలెంలో పాఠశాల నిర్వహిస్తున్నాం. మూడేళ్లుగా ఇలాగే కొనసాగుతోంది. కో ఎడ్యుకేషన్ నేపథ్యాన కాస్త ఇబ్బందిగా ఉంది. కొత్త నిర్మాణాలు పూర్తయితే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది.

– రాజేశ్, ప్రిన్సిపాల్, ఈఎంఆర్ఎస్

ఆగస్టులోగా అందుబాటులోకి..

రీ టెండర్ తర్వాత వేగంగా పనులు సాగుతున్నాయి. కాంట్రాక్టర్‌కు ఆగస్టు వరకు గడువు వుంది. ఈలోగా పనులన్నీ పూర్తవుతాయి. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా, నిర్మాణాలన్నీ పూర్తి చేస్తాం.

– నాగేశ్వరరావు, సెంట్రల్ పీడబ్ల్యూడీ ఏఈ

క్లుప్తంగా

గిరిజన యువత అభివృద్ధికి కృషి



శిక్షణ పూర్తి చేసుకున్న యువతికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు

భద్రాచలంఅర్బన్: గొత్తి కోయ గిరిజన యువత అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ రితేష్ ఠాగూర్ తెలిపారు. భద్రాచలంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం కింద గత జనవరి నుంచి మార్చి యువతకు నైపుణ్యాభివృద్ధి కోర్సులపై శిక్షణ కల్పించామని, 125 మంది శిక్షణ పొందగా, సర్టిఫికెట్లు కూడా అందజేశామని పేర్కొన్నారు. కంప్యూటర్ కోర్సుల్లో డిప్లొమా, వడ్రంగి, క్యాండిల్ మేకింగ్, ఫినైల్/డిటర్జెంట్, బేకింగ్/మిఠాయి వంటి కోర్సుల్లో ఏడుగురాళ్లపల్లి, చర్ల, దుమ్ముగూడెం, ఎటపాక, భద్రాచలం ప్రాంతాల్లో శిక్షణ ఇప్పించామని తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

28న 'ఏకలవ్య' ప్రవేశ పరీక్ష

చర్ల రూరల్ / టేకులపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చర్ల, టేకులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్ మచ్చ శకుంతల, భద్రయ్య వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

వెంకన్న గుడిలో ప్రేమ వివాహం



వధూవరులతో గ్రామస్తులు, కుటుంబీకులు

కరకగూడెం: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రేమజంటకు గ్రామపెద్దలు వివాహం జరిపించారు. కరకగూడేనికి చెందిన గొగ్గలి రవి, పద్మ దంపతుల కుమార్తె లక్ష్మీ ప్రసన్న, అదే గ్రామానికి పోలెబోయిన నర్సయ్య, నాగలక్ష్మి దంపతుల కుమారుడు శేఖర్ హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. వారి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో గ్రామపెద్దలు చర్చలు జరిపి ఇరు కుటుంబాలను ఒప్పించారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెళ్లి జరిపించారు.

నలుగురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: భూ వివాదం నేపథ్యంలో నలుగురు వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదుచేశారు. రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ రాఘవయ్య కథనం ప్రకారం.. మండలంలోని బస్వతారక కాలనీకి చెందిన బానోతు వీరూనాయక్, భద్రూనాయక్ సోదరులు. భద్రూనాయక్ భూమిలోని కలపను వారి తెలియకుండా వీరూనాయక్ నరికించి తీసుకెళ్లాడు. ఈ విషయమై భద్రూనాయక్ కుమారుడు భార్గవ్ ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో భార్గవ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వీరూనాయక్‌తోపాటు అతని కుమారులు రమేష్, సురేష్, అల్లుడు గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జూలూరుపాడు: జూలూరుపాడులోని ఓ ఇంటిపై శనివారం పోలీసులు దాడి చేసి, తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. రూ.34,500 నగదు, 10 సెల్‌ఫోన్లు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జీవన్ రాజు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

ఐదుగురు విద్యార్థులకు స్వల్పగాయాలు

కారేపల్లి: విద్యార్థులను ఎక్కించుకొని వస్తున్న ఆటోను ఎదురుగా ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీకొట్టడంతో ఆటో రోడ్డు కిందికి దూసుకెళ్లింది. మండలంలోని ఇల్లెందు సోలార్‌ప్లాంట్ సమీపాన శనివారం ఈ ప్రమాదం జరిగింది. భాగ్యనగర్ తండాకు చెందిన ఆటోడ్రైవర్ రోజు మాదిరిగానే ఐదుగురు విద్యార్థులను తీసుకుని ఇల్లెందులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు తీసుకెళ్లి మధ్యాహ్నం తీసుకొస్తున్నాడు. సోలార్‌ప్లాంట్ సమీపాన ఎదురుగా వచ్చిన ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీకొట్టగా ఆటో రోడ్డు కిందకు దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తతో పెద్దప్రమాదం తప్పినా ఆటోలో ఉన్న విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి సైతం తీవ్ర గాయాలు కాగా ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

పడావు పడినా పర్వాలేదా?!

- ఇల్లెందులో నిరుపయోగంగా గిరిజన భవన్
- మున్సిపాలిటీకి అప్పగించాలని రెండుసార్లు లేఖలు
- అయినా పట్టింపులేని ఐటీడీఏ అధికారులు
- ఫలితంగా రూ.1.10కోట్ల నిధులు వృథా



నిరుపయోగంగా మారిన గిరిజన భవన్ ఇదే

ఇల్లెందు: గిరిజన భవన్‌పై ఐటీడీఏ అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇల్లెందులో రూ.1.10కోట్లతో నిర్మించిన గిరిజన భవన్‌ను వినియోగంలోకి తీసుకురాలేదు. ఐదేళ్లుగా వృథాగా ఉంటున్న భవనాన్ని తమకు అప్పగిస్తే వినియోగంలోకి తెస్తామని మున్సిపాలిటీ నుంచి లేఖలు రాసినా పట్టించుకోవడం లేదు.

ఊరికి దూరంగా... అయినా...

ఇల్లెందు పట్టణంలో ఆర్అండ్ఆర్ కాలనీ సమీపాన ఐదేళ్ల క్రితం గిరిజన భవన్‌ను ప్రారంభించారు. తాగునీటి సదుపాయం లేదని తెలిసినా హడావుడిగా ప్రారంభించినట్లు ప్రకటించారు. అయితే నేటి వరకు ఇందులో ఏ శుభ, అశుభ కార్యక్రమం జరగలేదు. ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లన్నీ కళకళలాడుతున్నా గిరిజన భవన్ మాత్రం పడావుగా ఉంటోంది. కేవలం నీటి సదుపాయం లేదని దీన్ని వదిలేశారు. అయితే, ప్రభుత్వ కార్యక్రమాలైనా నిర్వహించే అవకాశమున్నా ఆ దిశగా ఏ అధికారీ ఆలోచన చేయకపోవడం గమనార్హం. కాగా, గిరిజన భవన్‌లో సభలు, సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం ఉంది. సుమారు వెయ్యి మంది సీటింగ్ కెపాసిటీతో నిర్మించగా.. సభావేదికకు తోడు రెండు విశ్రాంతి గదులు, వంటశాలే కాక మరుగుదొడ్లు, స్నానపు గదులు, వాటర్ ట్యాంకు, చుట్టూ ప్రహరీ ఇలా అన్నీ ఉన్నా వినియోగించకపోవడంతో నానాటికీ శిథిలావస్థకు చేరుతోంది.

మున్సిపాలిటీకి అప్పగిస్తేనే ఫలితం

గిరిజన భవన్‌లో నీటి సదుపాయం లేదనే విషయం నిజమే అయినా... మున్సిపాలిటీకి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే ఆ సమస్య సులువుగా పరిష్కారమవుతుందని చెబుతున్నారు. మున్సిపాలిటీలో కార్మికులు, సిబ్బంది ఉండడమే కాక తాగునీటి ట్యాంకర్లు అందుబాటులో ఉంటాయి. అలాగే, సమీపంలోని నర్సరీ నుంచి పైపులైన్ ఏర్పాటుకు పాలకవర్గం సిద్ధంగా ఉంది. ఈమేరకు మున్సిపాలిటీకి గిరిజన భవన్‌ను అప్పగిస్తే చిన్నచిన్న మార్పులు చేసి అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశముంది. ఫలితంగా తక్కువ ధరలో వేదిక అందరికీ అందుబాటులోకి రానుండగా.. అటు మున్సిపాలిటీకి సైతం ఆదాయం సమకూరుతుంది. ఈ విషయంలో రెండు మార్లు ఐటీడీఏ అధికారులకు లేఖ రాసినా పట్టించుకోకపోవడంతో పాలకవర్గం కూడా పెద్దగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది.

నిరుపయోగంగా మార్చారు..



అవగాహనలేని అధికారులు భవన్‌ను నిరుపయోగంగా మార్చారు. ప్రారంభోత్సవం జరిగిన కొత్తలో ఆనాటి ఐటీడీఏ పీఓ సొసైటీకి అప్పగిస్తామని చెప్పారు. అయితే అద్దె రూ.లక్షల్లో ప్రకటించారు. దీంతో ఆ అద్దె భరించడం సొసైటీకి కష్టమవుతుంది. ఏదైనా సంస్థకో, శాఖకో అప్పగిస్తే మంచిది.

– గొగ్గెల రామస్వామి, ఇల్లెందు

తాగునీటి ఎద్దడి కారణంగా...

గిరిజన భవన్ వద్ద తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఉంది. అక్కడ బోరు వేసినా నీళ్లు పడే అవకాశం లేదు. సింగరేణి అధికారులను కోరగా వారికే నీరు సరిపోవటం లేదని చెప్పారు. ఈ విషయాలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అన్ని అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– సాలార్, ఐటీడీఏ ఏఈ, ఇల్లెందు

లేఖలు రాశాం..



ఇప్పటివరకు ఐటీడీఏకు రెండు లేఖలు రాశాం. మా వద్ద సరిపడా సిబ్బంది ఉన్నారు. నీటి సదుపాయం కోసం అవసరమైతే సమీపంలోని నర్సరీ నుంచి పైపులైన్ ఏర్పాటు చేస్తాం. లేకపోతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం. ఆదాయం సమకూర్చునేలా గిరిజన భవన్‌ను తీర్చిదిద్ది ఉపయోగంలోకి తీసుకొస్తాం.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

'ఇండిపెండెంట్'గా ప్రచారం !



ద్విచక్రవాహనంపై నాగేశ్వరరావు

వైరా: ఆయన న్యాయవాది.. రాజకీయాల్లో ధనప్రభావం లేకుండా సామాన్యులు సైతం చట్టసభల్లో అడుగు పెట్టాలనే ఉద్దేశంతో ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో దిగేందుకు సిద్ధమై ప్రచారం ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంనకు చెందిన కటుకోజ్వల నాగేశ్వరరావు పదిహేనేళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. స్వచ్ఛ రాజకీయాల కోసం పోటీకి సిద్ధమైన ఆయన సాదాసీదాగా ప్రచారం చేస్తుండటం ఆకట్టుకుంటోంది. ద్విచక్రవాహనంపై మైక్ ఏర్పాటు చేసుకుని ఫ్లెక్సీలు బిగించుకుని ప్రచారం చేస్తున్నారు. స్వచ్ఛ రాజకీయాల కోసం తనను గెలిపించాలని ఎక్కడ ఇద్దరు, ముగ్గురు కనిపించినా ఆగి కోరుతున్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొత్తగూడెం నుంచి పోటీ చేసిన నాగేశ్వరరావు 455 ఓట్లు సాధించారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఒంటరిగానే ద్విచక్రవాహనంపై తిరుగుతూ ప్రచారం చేస్తానని వెల్లడించిన ఆయన మూడు రోజుల్లో నామినేషన్ వేస్తానని తెలిపారు.

● ఠాణాలో బండ్లు, ఎడ్లు..



త్రీటౌన్ స్టేషన్ ఆవరణలో ఉన్న ఇసుక బండ్లు, ఎడ్లు

కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు స్టేషన్ ఆవరణలో ఎడ్లను బంధించారు. పట్టణంలోని పాతకొత్తగూడేనికి చెందిన కొందరు పాతకొత్తగూడెం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా శనివారం తెల్లవారుజామున గాజులరాజంబస్తీలోని ఇండేన్ గ్యాస్ రోడ్డులో 11 ఎడ్లబండ్లను త్రీటౌన్ పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఎడ్లబండ్లను స్టేషన్ ఆవరణలో ఉంచి, యజమానులను పోలీసులు హెచ్చరించి తహసీల్‌కు పంపడంతో తహసీల్దార్ పుల్లయ్య ఒక్కో బండికి రూ. వెయ్యి జరిమానా విధించారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు 22 ఎడ్లు స్టేషన్ ఆవరణలోనే ఉండగా, పలువురు ఆసక్తిగా చూశారు.

– కొత్తగూడెంఅర్బన్

గుండెపోటుతో ఖమ్మం జైలు ఉద్యోగి మృతి



ఫకీర్ అహ్మద్ (ఫైల్)

తల్లాడ: ఖమ్మం జైలులో హెడ్‌వార్డర్‌గా విధులు నిర్వర్తిస్తున్న షేక్ ఫకీర్‌అహ్మద్ (58) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. తల్లాడ మండలం మల్లవరానికి చెందిన ఆయన జైలులో గురువారం రాత్రి విధులు నిర్వర్తించాక శుక్రవారం ఉదయం స్వగ్రామానికి వచ్చాడు. ఒంట్లో నలతగా ఉండటంతో కల్లూరులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన కుమారుడికి ఫోన్ చేసి అక్కడకు వెళ్లగా ఆస్పత్రిలో చూపించారు. ఆ తర్వాత కుమారుడి ఇంటికి వచ్చిన ఆయనకు రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం ఉదయం మల్లవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, ఫకీర్ జైళ్ల శాఖలో చేరే ముందు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయన మృతదేహం వద్ద ఖమ్మం జిల్లా జైలు సూపరింటెండెంట్ శ్రీధర్, జైలర్ లక్ష్మీనారాయణ, కల్లూరు ఎస్‌ఐ ఎస్‌కే షాకీర్, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, మేకల మల్లిబాబుయాదవ్, దిరిశాల నరసింహారావు, దుండేటి వీరారెడ్డి, దగ్గుల రఘుపతిరెడ్డి, పొట్టేటి జనార్దన్‌రెడ్డి, పగడాల లచ్చిరెడ్డి, రాయల రాము, కటికి కిరణ్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు.

స్త్రీ నిధి సొమ్ము.. సీసీ స్వాహా?

- ఏపీఎంకు షోకాజ్ నోటీస్ జారీ
- పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోని అధికారులు

దమ్మపేట: తిరిగి చెల్లించాల్సిన స్త్రీ నిధి సొమ్మును సొంత ప్రయోజనాలకు వాడుకున్న వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఐకేపీ కార్యాలయంలో పనిచేస్తున్న సంజీవని క్లస్టర్ సీసీ కృష్ణవేణి స్త్రీ నిధి ఖాతాలకు తిరిగి చెల్లించాల్సిన సొమ్ము రూ. 5,13,700ను సొంత ప్రయోజనాలకు వాడుకుంది. ఈ విషయమై గత నెల మార్చి 16న జరిగిన సమీక్ష సమావేశంలో సీసీని, ఉన్నతాధికారులు మందలించగా అదే నెల(మార్చి) 18 నాటికి తిరిగి చెల్లిస్తానని రాతపూర్వకంగా రాసిచ్చింది. గడువులోగా చెల్లించకపోవడంతో దమ్మపేట ఏపీఎం నాగేశ్వరరావుకు మార్చి 19న ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసు ఇచ్చారు. కాగా షోకాజ్ నోటీస్ ఇచ్చాక సీసీ వినియోగించుకున్న రూ. 5,13,700ను తిరిగి స్త్రీ నిధికి చెల్లించిందని తెలిపారు. అయితే ఇంకా రూ. 3 లక్షల సొమ్ము సీసీ కృష్ణవేణి సొంత ప్రయోజనాలకు వాడుకున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఏపీఎంను వివరణ కోరగా.. ఆరోపణలు వాస్తవమేనని తెలిపారు. ప్రాథమిక విచారణలో రూ. 1,50,000 సొంత ప్రయోజనాలకు వాడుకున్నట్లు తేలిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపామని పేర్కొన్నారు. అయితే నిధులు స్వాహా చేసిన సీసీపై అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడంలేదనే ప్రశ్న తలెత్తుతోంది.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొత్తగూడెంటౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్న వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అన్నపురెడ్డిపల్లి, పినపాక, అశ్వాపురం, సుజాతనగర్, జూలూరుపాడు తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించామని అగ్నిమాపక శాఖ అధికారి గుండా పుల్లయ్య తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లోని మార్కెట్ సముదాయాలు, ఆస్పత్రులు, జనావాసాల్లో డెమో రూపంలో అవగాహన కల్పించామనానరు. అగ్ని ప్రమాదం జరిగితే తక్షణమే 101కు సమాచారం అందించాలని కోరారు.

బంగారు గొలుసు అపహరణ



పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీస్ జాగిలం

చంద్రుగొండ : మండలంలోని బెండాలపాడు గ్రామంలో ఇంటి ఆరు బయట నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ చేశారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, బాధితురాలి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం అందనాలపాడు గ్రామానికి చెందిన బాణోత్ మంగమ్మ, భర్త రాములు, కూతురుతో కలిసి తన తల్లిని చూసేందుకు బెండాలపాడు వచ్చింది. అందరూ ఇంటి బయట పడుకోగా అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మంగమ్మ మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు అపహరించుకెళ్లాడు. అయితే గొలుసు తెగి సగం అక్కడే పడిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ మాచినేని రవి సంఘటనా స్థలాన్ని సందర్శించగా, పోలీస్ జాగిలంతోపాటు క్లూస్‌టీం ఆ ప్రాంతాన్ని పరిశీలించాయి.

రౌడీషీటర్ల బైండోవర్

అశ్వారావుపేట: ఐదుగురు రౌడీషీటర్లను తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

మద్యం స్వాధీనం

పాల్వంచరూరల్: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో బెల్టుషాపుల్లో శనివారం ఎక్సైజ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలోని రాజాపురానికి చెందిన బి.సత్యనారాయణ ఇంట్లో రూ.16 వేల విలువైన 67 క్వార్టర్లు, 12బీర్లు, 12 బ్రీజర్ సీసాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ మేరకు ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి కె.రాజేష్, ఎక్సైజ్ సీఐ ఎం. ప్రసాద్‌గౌడ్ వివరాలు వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామంలో గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి ఎస్సైలు తిరుపతిరావు, సురేష్ పట్టుకున్నారు. గొల్లగూడెం, ఆనందాపురం గ్రామాలకు ఇసుక తరలిస్తుండగా చింతిర్యాల క్రాస్ రోడ్డులో ఒకటి, గొల్లగూడెంలో సీతారామ ప్రాజెక్ట్ కాలువ వంతెన వద్ద మరో ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

బాలిక అదృశ్యం

అశ్వారావుపేట: అశ్వారావుపేట నందమూరి కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక అదృశ్యంపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 17న ఇంటి నుంచి కూల్ డ్రింక్ కొనుగోలుకు బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు.

పాత బావిలో పడ్డ శునకం

రెస్క్యూ చేసి కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



పాడుబడ్డ బావిలో పడిపోయిన వీధికుక్క



కుక్కను బావిలో నుంచి బయటకు తీస్తున్న సిబ్బంది

బూర్గంపాడు: ఫైర్ సిబ్బంది రెండుగంటలపాటు రెస్క్యూ చేసి పాడుబడ్డ బావిలో పడిన వీధి కుక్కను కాపాడారు. మండల కేంద్రం బూర్గంపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న పాడుబడ్డ బావిలో శనివారం ఉదయం ఓ వీధికుక్క ప్రమాదవశాత్తు పడిపోయింది. కుక్క బిగ్గరగా అరుస్తుండగా స్థానికులు గమనించి కాపాడే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవటంతో పాల్వంచకు చెందిన జంతు ప్రేమికురాలు యామిని ద్వారా భద్రాచలం అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు బావి వద్దకు చేరుకుని కుక్కను రక్షించారు. అయితే పాత బావి కావడంతో ప్రమాదకరంగా ఉంది. అంచులు కూలిపోతున్నాయి. బావిలో నుంచి ఏమైనా విషవాయువులు ఉత్పత్తి అవుతాయామోననే ఆందోళన కూడా కలిగింది. గతంలో బూర్గంపాడులో రెండుసార్లు బావుల్లో విషవాయువులు వెలువడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి. ఈ క్రమంలో రెండుగంటలపాటు శ్రమించి, కుక్కను బయటకు తీయగా, ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

వాగులో మునిగి పశువుల కాపరి మృతి



కొట్టె శ్రీను (ఫైల్)

ములకలపల్లి: వాగులో మునిగి పశువుల కాపరి మృతి చెందిన సంఘటన ములకలపల్లిలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ములకలపల్లి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కొట్టె శ్రీను (38) పశువులు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగే శనివారం కూడా పాములేరు వాగు సమీపంలోకి పశువులను మేపేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పశువుల వద్ద ఎవరూ లేకపోవడంతో స్థానికులు వెతకగా, వాగు ఒడ్డున శ్రీను చెప్పులు కనిపించాయి. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని స్థానికులతో కలిసి వాగులో గాలింపు చేపట్టగా, శ్రీను మృతదేహం లభ్యమైంది. వాగులోకి దిగిన గేదెలను మళ్లించే క్రమంలో శ్రీను నీటిలో మునిగి, మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడికి కూతురు, దివ్యాంగురాలైన అక్క ఉన్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు. కాగా ఘటనా స్థలానికి సమీపంలో వాగుపై వంతెన నిర్మిస్తున్నారు. దీంతో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేసినా, సరిగ్గా నీళ్లు ప్రవహించక బ్రిడ్జి నిర్మాణం ఎగువన భారీగా నీళ్లు నిలిచాయి.

● నేటి నుంచి పవిత్రోత్సవాలు



వేడుకలకు సిద్ధమైన ఆలయం

ఖమ్మంరూరల్ : మండలంలోని రెడ్డిపల్లి శ్రీ మారెమ్మతల్లి అమ్మవారి ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రధానార్చకులు కాశావజ్జుల రామశర్మ, ఆలయ మేనేజర్ సూర్యదేవర శ్రీనివాస్ తెలిపారు. నేడు ఉదయం 8 గంటలకు గోపూజతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. 22వ తేదీన సామూహిక కుంకుమార్చన, చండీ హోమం తదితర కార్యక్రమాలు, 23న అమ్మవారికి అష్టోత్తర శత కలశాలతో మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని వివరించారు.